# చేప కన్ను మిల మిలా -
# బాలయ్య కన్ను తెల తెలా

భుజమ్మీద వల వేసుకుని, తాటాకుల గుడిసెలోంచి వొంగి బయటకువచ్చి, అరుగు పక్కగా వున్న చెప్పులు కాళ్ళకు తగిలించుకుని బయలుదేరాడు బాలయ్య.

రెండడుగులు వేసి తలయెత్తి పైకి చూశాడు.

''అబ్బో! సూరీడు పైకి పైకి వస్తుండాడే?'' సన్నగా అనుకుంటూ గబగబా అడుగులు ముందుకు వేశాడు.

ప్రతిరోజూ జాలరులందరూ కలిపి ఏటి ఒడ్డుకు వెళ్లేవాళ్ళు. ఈరోజు అతడొక్కడే వెళ్లుతున్నాడు. పదిబారల దూరం నడిచి మళ్ళీ ఇంటివైపుకు తిరిగాడు. కంఠంమీద ఉన్న నరాలు పొంగినట్టుగా పైకి తేలాయి. పళ్లు కరుచుకున్నాయి. మీసం మెలివేశాడు. తలవంకిస్తూ ముందుకు సాగాడు.

కడుపు రుద్దుకున్నాడు. కడుపులో సొద

''లచ్చి కేమయిందియాల? చీకటితో లేచి గంజి కాయగూడదూ?''

''తనొకేళ రాత్రి పొద్దు పోయినంక వట్టి చేతులతో ఇంటికొచ్చాడే అనుకో. ఏం వస్తే? డబ్బులివ్వలేదని కడిగి బోర్లేసిన కుండలు చూపిస్తదా? ఏం పొగరు? అందుకే మనోళ్ళు మనువుకు మరో దిక్కుకు పోగూడదన్నారు.''

''రేత్రి కడుపులో ఏమీలేదు. మండిపోతావుంది? పెందలకడ పోదామంటే కడుపులోనికి పోయింది. తెల్లారినంక కూడ లెగవక చాపమీద దొర్లుతావుంది. లచ్చి'' కోపం పట్టలేక మూలనున్న కర్ర తీసుకొని కొట్టడం మొదలుపెట్టాడు. ఒళ్లు తెలియకుండా.

లచ్చి ఒళ్లు పొంగిపోయింది. ఒళ్ళంతా వాతలు తేలింది. ఒక దెబ్బ కంటి మీదుగా తలమీద పడ్డం లచ్చి అరుపులు రంకెల్లా ఎంతో దూరం వరకు వినబడు తున్నాయి కసి పట్టలేక కాలితో ఒక్కతన్ను తన్ని కర్ర దూరంగా పారేశాడు. చెవిపోగు సవరించుకుంటూ తలకు పాగా చుట్టుకొని గడప దాటాడు. కోపంకొద్దీ అడుగులు గబగబ వేస్తున్నాడు.

''ఏం బాలిగా! పొద్దెక్కి వచ్చినవే?'' సుబ్బడడిగాడు ఏటొడ్డున!

బాలయ్య వలకలేదు. చుట్టూ చూశాడు. జాలరులంతా వలలు దులిపి కుప్పలు పోస్తున్నారు.

బాలయ్యకు పౌరుషం హెచ్చింది. తెప్పను ఏటి మధ్యకు తీసుకుపోయి బలంగా వల విసిరాడు. లాగుతుంటే వల బరువుగా అనిపించింది నిన్నటికీ ఇవాల్టికి కలిపి ఇవాళే లాగాలి అనుకున్నాడు. వల లాగి గంపలో దులిపాడు. ముఖం చేటంతయింది. 'నా సామిరంగ! పెద్ద చేపలు పడినయే'' నవ్వుకుంటూ మరోసారి పళ్లు బిగించి వల విసిరాడు. ఈసారి వచ్చినవన్నీ చిన్న చేపలే. అన్నిటినీ వలలోకి వంపుకొని అవతలి గట్టుకు చేరాడు.

ఏటికి అవతలి గట్టున చిన్నపల్లె వుంది. ఆ పల్లె దాటితే చేపల అంగడి బాలయ్యకు కడుపులో ఏమీలేదు. పొద్దు తిరిగింది. కోపావేశంతో పల్లె దాటి సంతకు వెళ్ళాడు. అక్కడ వల కుమ్మరించి కూర్చున్నాడు. కుప్పగా పోసిన చేపల వైపు చూసుకున్నాడు. ఇవాళ తనకు పది రూపాయలపైన రావాలని అంచనా వేసుకున్నాడు

కుప్పగా పోసిన చేపలమీద జానెడు పొడుగున ఒక చేప మిలమిల మెరుస్తూ తోక అటూ యిటూ ఆడిస్తున్నది. లేత నీలం తెలుపూ కలిపిన అలిచిప్పలరంగులో కొంత భాగం-పంచ రంగులు కలగలిపినట్టు కొంత భాగం-దాని శరీరం ఒక వింత అందంతో వెలిగిపోతున్నది. బాలయ్య దాన్ని చేతులోకి తీసుకొని ఇటు అటూ తిప్పి చూస్తున్నాడు. దాని కళ్లు వింతగా వున్నాయి! కళ్ళను తిప్పితిప్పి చూస్తున్నది. ఒక్కొక్కసారి దృష్టి నిలిపి బాలయ్య తన కళ్ళల్లోకి చూస్తున్న దనుకున్నాడు.

ఇంత అందమైన చేపను తాను చూడలేదు. ''దీన్ని అమ్మను.'' మంగికివ్వా లనుకున్నాడు. దానిని వలలో వేసుకుని కుప్పలు బేరంపెట్టాడు. అతడు అనుకున్న దానికంటె మంచి బేరం తగిలింది. రూపాయలు తోలు సంచిలో సర్దుకొని వల భుజాన వేసుకొని యింటి వైపుకు మళ్ళాడు.

ఇల్లు సమీపిస్తున్నదనగానే అతడి మనసు కుతకుతలాడటం మొదలుపెట్టింది. బుర్ర వేడెక్కిపోతున్నది.

నడక వేగం తగ్గింది. ఆలోచనలు రేగుతున్నాయి. మూడు రోజులనాడు భూలచ్చిమి—అదే లచ్చి ఏం చేసింది? తనతో కూడా వచ్చింది. ఏటి ఒడ్డున కూచుంది. తను చేపలు కుప్ప పొయ్యటానికి తెప్ప దిగి వస్తుంటే నాగన్నతోపాటు నవ్వుతోంది—గవ్వలు గలబరించినట్టు నవ్వుతోంది. పడీ పడీ నవ్వుతోంది.

నాగన్న ఇరవై ఏళ్ళవాడు. ఎర్రటి జుట్టు. ఎత్తు పళ్లు. ఎడమకాలు సొట్ట.

''వీడిలో ఏం చూసి నవ్వుతోంది? ఆడికీ దానికీ నవ్వు ఏటి కొస్తుండాది?'

నవ్వులయ్యాయి. నాగన్న లచ్చిని ఒంగపెట్టి రెండు చేతులతో వీపుమీద తపతప కొడుతున్నాడు. పళ్లు బిగించి....లచ్చి ఇంకా నవ్వుతోంది.

ఇదేటి?

నవ్వులయినాయి. ఇక కొట్లాటలా?

ఇదేటి సరాగం?

ఆ రోజు ఒక కుప్ప గంపలో పోసుకొని తనే చేపల బజారులో పోశాడు. చేతికొచ్చిన డబ్బుతో మంగి యింటికెళ్ళి జల్సా చేసుకున్నాడు.

మరునాడు కూడా బాలయ్యతో లచ్చి వెళ్ళింది. బాలయ్య తెప్పనెక్కి చేపలు పట్టాడు. ఏటికావలి ఒడ్డుకు చేరుకున్నాడు.

లచ్చి బాలయ్యకోసం చూస్తోంది. జనం పలచబడ్డాయి.

"ఇయాళ ఎంతదూరం పోయిందు కంటికి కానరాకుండా?" ఏటివైపు చూసుకుంటూ వేళ్ళతో ఇసుకలో గీతలు గీసుకుంటూ పదాలు పాడుకుంటూ కూర్చుంది లచ్చి.

వచ్చిన జనమంతా వెళ్ళిపోయారు. బాలయ్యకేమయింది? లచ్చికి తెలియ లేదు. బిక్క మొఖంతో తిరుగుముఖం పట్టింది. ఇలా ఇది రెండోరోజు.

గుడిసె గొళ్ళెం తీసింది. చాప పరుచుకుని పడుకుంది.

సంజ చీకట్లలో బాలయ్య తిరిగి వచ్చాడు. కొడుకు కనబడలేదు. వాడు అరటిపళ్లు కొట్టాయన చేతికింద పని చేస్తాడు. అక్కడే ఏదో తింటాడు. చీకటి పడ్డ తరువాత వచ్చి పడుకుంటాడు.

ఇంకా రాలేదు కాబోలు.

చాపమీద పడుకున్న లచ్చి లేవలేదు.

గంజి కాయలేదని కఱ్ఱతో తెగబాదేశాడు, కోపం చల్లారక తెల్లవారి మళ్ళీ కఱ్ఱ తీసుకున్నాడు.

దీపాలు పెట్టేవేళ. మిలమిల మెరిసే కళ్ళతో చూస్తున్న చేపను అపురూపంగా వలలోనుంచి చూస్తూ ఇంట్లో అడుగుపెట్టాడు బాలయ్య. లచ్చి గొడ్డులా మూలుగుతున్నది కొడుకు ఉడుకు నీళ్ళల్లో గుడ్డముంచి తల్లి వీపూ కాళ్లూ కాపుతున్నాడు.

విసురుగా బాలయ్య పెరట్లోకి వెళ్ళి కాళ్ళూ చేతులూ కడుక్కుని బైట అరుగుమీద కూర్చున్నాడు. ఆలోచనలు నీళ్ళు పొంగినట్లు పైపైకి పొంగుకుంటూ వస్తున్నాయి.

సింగన్న కూతురు మంగిని చిన్నప్పటి నుంచీ బాలయ్యకిచ్చి పెళ్ళి చేయాలని మాటలు జరిగాయి. మధ్యలో సింగన్నకూ, బాలయ్య తండ్రికీ మాటలు చెడిపోయాయి.

నలుగురిలో "ఈడికేంటి పిల్లనిచ్చేది" అన్నాడు సింగన్న ఒకనాడు.

దాంతో ఈ పెళ్ళాగిపోయింది. ఆవేశాలతో ఇద్దరికీ విడివిడిగా పెళ్ళిళ్ళయ్యాయి. కానీ - బాలయ్యకు, మంగికి మధ్య ఉన్న స్నేహ సంబంధాలు చెడలేదు. అవి సాగుతూనే వున్నాయి.

ఒకనాడు మంగి ఏటి ఒడ్డుకు వస్తే బాలయ్య ఆమెతో సరాగాలాడి చేపలు పట్టలేదు. లచ్చి రానిరోజుల్లో బాలయ్య సాధారణంగా చేసె పనే యిది. అందుకే గుడిసెలో ఒకనాడు గంజి, ఒకనాడు కూడు.

ఆనాడు లచ్చి వెంట వచ్చింది. దూరాన తెప్పమీద ఉన్న బాలయ్యకు మంగితో తన సరాగాలు జ్ఞాపకం వచ్చాయి. మనసునిండా మంగి - కంటి ఎదుట లచ్చి. మంగితో తానాడే సరాగాలే లచ్చి నాగన్నతో ఆడుతున్నట్లనిపించింది.

ఎంత చిత్రం?

నిజంగా ఆనాడు లచ్చి రానూలేదు. లచ్చితో సరాగాలాడినట్లనిపించిన నాగన్న ఊళ్లోలేనూ లేడు.

"ఇదేటి? ఇట్ట జరిగింది?"

ఆ చేపతో నిజంగా మంగిచేత పులుసు చేయించుకుందామని ఏటికవతల సంతకు పెళ్లాడు.

వచ్చిన డబ్బులు సంచిలో వేసుకునేటప్పుడు ఎన్నో అనుకున్నాడు. "మంగికి మంచి చీరె కొంటే? మంచి రైకలు రెండు కొంటే? రెండు చేతుల నిండా గాజులేయిస్తే? అయ్యన్ని లేవుగాని - రెండు రైకలుకొని - చేతులనిండ గాజులేయించి - తల్లో పూలు కొనిపెట్టి చేరాక ముంతెడు కల్లు తాగితే? ఎంత మజా? ఎంత మజా?

అక్కడినుంచే మంగి యింటికి వెళ్ళాడు. మంగి తన మగడికి ఒళ్ళురుద్ది, నీళ్ళు పోస్తోంది.

ఆ దృశ్యం చూడటానికి అసహ్యమేసింది. కంటిలో నలుసు గుచ్చుకున్నట్ట యింది. "సీ సీ" అనుకున్నాడు. అంత సంబరం చప్పగా చల్లారింది.

ఇంటికి రాగానే తను కొట్టిన దెబ్బలు లచ్చి ఒంటినిండా వాతలు గుర్తొచ్చాయి. మనసు కంతబారింది.

చుట్టుపక్కల కలయజూశాడు. అన్ని గుడిసెలలో కిరసనాయిలు దీపాలు మిణుకుమిణుకు మంటూ వెలుగుతున్నాయి. తన గుడిసెల్లో మసకచీకటి.

అరుగుమీద కూర్చున్న బాలయ్య దిగ్గున లేచాడు. లోపలికి వెళ్ళి, లచ్చికి ఒళ్ళు కాపుతున్న బట్టను కొడుకు చేతిలోనుంచి తీసుకుని "అబ్బిగా. మీ యమ్మకు నేను కాపుతాగాని. దీపం వెలిగియ్" లచ్చి పక్కన కూర్చున్నాడు లచ్చి మొఖం చూడలేక పోతున్నాడు తల భూమిలోకి దిగిపోతున్నది.

దీపపు వెలుగులో వలలో నుంచి చేపకళ్ళు మెరుస్తున్నాయి.

"అయ్యా. దాంతో పులుసు కాయనా" అడిగాడు కొడుకు.

"ఒద్దురా. దాన్ని ఆ పక్కబాయిలో పారేయ్. నీకు చేతనయితే గంజి కాయి - నూకలు తెచ్చిన"

"మెల్లగ లేచి పులుసు కాత్తాలే ! మనసుపడి తెచ్చుకున్నావ్ ' మూలుగుతూనే లచ్చి లేవబోయింది.

"ఒద్దే. గంజి చాల్లేయే. నా కళ్ళు నిన్న గుడ్డిగయినయే. గుడ్డివాడికిదే శిచ్చ. నీ కన్నేదే ! తెరపిచ్చిందా ?" చేత్తో కన్ను తడిమాడు.

"లేదుమావా. గుడ్డులో నుంచి రగతం కారింది. తెరపిడిలేదు" బట్టతో ఒత్తుకుంది.

"అయ్యో. అయ్యో" తల బాదుకున్నాడు బాలయ్య. "నా చేతులు కాలిపోను. ఎంత పని చేసినావే లచ్చీ" చేతులు నేలకేసి కొట్టుకున్నాడు.

"నాకు మైకం కమ్మి కళ్లు గుడ్డిగయినయ్ నా కోపంతో నీ కన్ను పోగొట్టిన" లచ్చి ఒంటిమీద తేలిన వాతలను చేత్తో రాస్తూ కన్నీరు గార్చాడు బాలయ్య.

"నాయనా గంజి" కొడుకు రెండు ముంతలతో గంజి తెచ్చాడు.

"లచ్చీ ! గంజి తాగే" లచ్చిని మెల్లగా లేవదీసి తన గుండెకు ఆనించుకుని తాగించాడు బాలయ్య.

"మావా !"

"ఇయ్యాళ గంజి మా రుచిగా ఉంది మామా."

ఆమె రెండు చేతులతో అతడి చేతిని గట్టిగా పట్టుకుంది సంబరంతో.

"మావా! పొద్దుటేలనుంచీ ఏం తినలేదు కదా!" కడుపు తడిమింది మమతతో.

ముఖం పక్కకు తిప్పుకుని కళ్లు ఒత్తుకున్నాడు బాలయ్య.

('సిరిమల్లె' పత్రిక.)